నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 20 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

మంచిర్యాల నుంచి పెద్దపల్లికి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

పెద్దపల్లి ఎంపీ స్థానం బీఆర్ఎస్‌దే

- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- కొప్పుల ఈశ్వర్ నామినేషన్‌కు తరలిన బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 19 : పెద్దపల్లి పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్‌దేనని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ నామినేషన్ సందర్భంగా శుక్రవారం మంచిర్యాలలోని తన నివాసం నుంచి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పెద్దపల్లికి బయలుదేరి వెళ్లారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ భారీ మెజార్టీతో గెలుస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ నిజ స్వరూపాన్ని ప్రజలు గుర్తించారని, ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కేసీఆర్ పాలన ఏ రకంగా ఉందో, రేవంత్‌రెడ్డి పాలన ఏ రకంగా ఉందో ప్రజలు బేరీజు వేసుకొని ఓటేయాలన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబితేనే.. ఆరు గ్యారంటీలు అమలు చేస్తారని తెలిపారు. ఇక బీజేపీకి ఓటు వేస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, అప్పుడు మనం ఏదైనా ప్రశ్నిస్తే జైళ్లలో పెడుతారని చెప్పుకొచ్చారు. కొప్పుల ఈశ్వర్‌కు ఇక్కడి సమస్యలు తెలుసని, కార్మిక నాయకునిగా, సౌమ్యుడిగా ఎంతో పేరున్న ఆయనను గెలిపించుకుంటేనే ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విజిత్‌రావు, గాదెసత్యం, తోట తిరుపతి, శ్రీపతి వాసు, శెట్టి శ్రీనివాస్, రేష వేణి రవికుమార్, మల్లేశ్, కొట్టె మల్లయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి సురేందర్‌రెడ్డి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో చేరిక
- శ్రీరాంపూర్ నుంచి 200 మందితో పెద్దపల్లికి తరలిన నేత

శ్రీరాంపూర్, ఏప్రిల్ 19 : మంచిర్యాల జిల్లా కోల్‌బెల్ట్ నస్పూర్, శ్రీరాంపూర్ ఏరియా తెలంగాణ ఉద్యమ కారుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. శ్రీరాంపూర్ కాలనీ నుంచి 200 మంది కార్యకర్తలతో పెద్దపల్లికి తరలిన ఆయన, బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ విప్ బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, చందర్, మనోహర్‌రెడ్డి సమక్షంలో టీబీజీకేఎస్ కేంద్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి ఆధ్వర్యంలో 200 మందితో కలిసి బీఆర్ఎస్, టీబీజీకేఎస్‌లో చేరారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కండువా కప్పి వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పెట్టం లక్ష్మణ్, బండి రమేశ్, పానగంటి సత్తయ్య, పుప్పాల సంపత్, తొంగల రమేశ్, అన్వేష్‌రెడ్డి, సాదుల భాస్కర్, పొగాకు రమేశ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సాయి, శ్యాంకుమార్, ఉత్తేజ్‌రెడ్డి, దినాకర్, నిరీక్షణ్, రమణారెడ్డి, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సురేందర్‌రెడ్డికి కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

సొంత పార్టీలో చేరాను : సురేందర్‌రెడ్డి

తెలంగాణ ఉద్యమంలో కోల్‌బెల్ట్ ప్రాంతం నుంచి కీలక పాత్ర పోషించి రాష్ట్ర సాధించుకున్నాం. సింగరేణిలో రెండుసార్లు టీబీజీకేఎస్ గుర్తింపు కార్మిక సంఘంగా గెలవడంలో ముఖ్య భూమిక పోషించాను. యూనియన్ ఎన్నికల సమయంలో ఐఎన్‌టీయూసీలో చేరాను. కానీ అందులో ఉద్యమ కారులకు స్థానం లేదని గ్రహించాను. అందుకే తిరిగి సొంత పార్టీలోకి వచ్చాను. రెండుసార్లు ఎంపీటీసీగా, టీడీపీ జిల్లా కార్యదర్శిగా పనిచేశాను.

మధ్యం, డబ్బు అక్రమ రవాణాపై నిఘా పెట్టాలి

నేర సమీక్షలో ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 19 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు అక్రమ రవాణాపై నిఘా పెట్టాలని, నిషేధిత మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ సురేశ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో అన్ని పోలీస్‌స్టేషన్ల సిబ్బందితో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కేసుకు సంబంధించిన ప్రతి విషయాన్ని రికార్డుల్లో భద్రపరచాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో నదీ తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఓటరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదుదారులపై మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ అడ్మిన్ ప్రభాకర్‌రావు, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల సీఐలు, ఎస్సైలు, ఆర్ఐలు, డీసీఆర్బీ, ఐటీ, విభాగాల ఎస్ఐలు, డీపీవో సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లడుతున్న జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్

రూ.71 వేలు పట్టివేత

వాంకిడి, ఏప్రిల్19 : మండలంలోని టోల్ ప్లాజా వద్ద శుక్రవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా, రూ. 71,500 పట్టుకున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. మహారాష్ట్రలోని గడ్చిరోలికి చెందిన గొడిసెలవార్ కారులో నగదును పట్టుకుని సీజ్ చేశామని ఆయన పేర్కొన్నారు. ఎస్ఐ గంగన్న, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి

- పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి
- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, ఏప్రిల్ 19 : జిల్లాలో ఉపాధి హామీ పనులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాహుల్, డీఆర్‌డీవో కిషన్, డీపీవో వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో గణపతితో కలిసి ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఏపీవోలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, వేసవి దృష్ట్యా పని ప్రదేశాల్లో తాగునీరు, నీడతో పాటు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వడదెబ్బకు గురైన వారికి ప్రాథమిక చికిత్స అందించి సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ప్రభుత్వ దవాఖానలకు తరలించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు పని ప్రదేశాలను సందర్శించాలని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని, జాబ్‌కార్డుల వివరాలను నమోదు చేయాలన్నారు. నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోఅభివృద్ధి పనుల్లో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏకరూప దస్తుల తయారీ కోసం విద్యార్థుల కొలతలు తీసుకున్నారని, మెటీరియల్ రాగానే కుట్టు ప్రారంభిస్తారన్నారు. లోక్‌సభ ఎన్నికల విజయవంతానికి అధికారులందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. అనంతరం అందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు.

ర్యాండమైజేషన్ పూర్తి

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు మొదటి ర్యాండమైజేషన్ పూర్తయ్యిందని, ఈవీఎం, వీవీ ప్యాట్లను ఆయా చోట్లకు తరలించామని, ఆయా సెగ్మెంట్ల పరిధిలో ఎలక్ట్రానిక్ ఓటింగ్‌యంత్రాల భద్రత కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని ఈవీఎం గోదాం నుంచి జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, ఆర్డీవో రాములు,ప్రత్యేక ఉప పాలన ఆధికారి చంద్రకళతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం, వీవీ ప్యాట్ల సెగ్రిగేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్‌యంత్రాలను కేటాయించినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్19 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తయ్యిందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, రాజకీయ పార్టీ నాయకులతో కలిసి ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందన్నారు, ఇందులో భాగంగా ఆసిఫాబాద్ నియోజకవర్గానికి 391 బ్యాలెటింగ్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, 448 వీవీ ప్యాట్లు కేటాయించడం జరిగిందని, సిర్పూర్ నియోజకవర్గానికి 352 కంట్రోల్, బ్యాలెటింగ్ యూనిట్లు, 403 వీవీ ప్యాట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి కేటాయించిన వాటిని జిల్లా కేంద్రంలోని పీటీజీ పాఠశాలలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసిన భద్రపరిచామని, సిర్పూర్ నియోజకవర్గానికి కేటాయించిన వాటిని కాగజ్‌నగర్‌లోని సెయింట్ క్లారెంట్ పాఠశాలలో భద్రపరిచామన్నారు. అంతకుముందు కాగజ్‌నగర్‌కు కంటైనర్‌లో ఈవీఎంలను పోలీసుల బందోబస్తు మధ్య తరలించారు. ఆర్డీవోలు లోకేశ్వరరావు, కే. సురేశ్, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

మీకోసం ప్రశ్నించే గొంతుకనవుతా

మీ బిడ్డకు అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

నా చివరి శ్వాస వరకూ మీతోనే ఉంటా ● అన్నా.. అంటే మీ సోదరుడిగా నేనున్నా

- ఆగర్భ శ్రీమంతుడికి.. భూగర్భ కార్మికుడికి మధ్యే పోటీ
- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ● అట్టహాసంగా నామినేషన్ దాఖలు
- అంబేద్కర్ చౌక్ వద్ద రోడ్‌షో ● పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు

పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ) : కార్మిక, కర్షకుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడుతానని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను నమ్మి ఓటేస్తే ప్రజలను నట్టేట ముంచిందని మండిపడ్డారు. ఆ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక కావాలని, తనకు ఆ అవకాశాన్ని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. తర్వాత నుంచి అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన రోడ్ షోకు హాజరయ్యారు. పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి అశేషంగా తరలివచ్చిన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రశ్నించే గొంతుకలపై రేవంత్ సర్కార్ అక్రమ కేసులను పెడుతున్నదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో లేకుండా పోయాయని, ధర్మారంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి సల్వాజీ మాధవరావుపై దాడిని ఉదహరించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, కానీ నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సాగు నీరందక, కరెంటు రాక రైతులు అన్నమో రామచంద్రా.. అని ఆర్తనాదాలు చేస్తున్నారని ఆవేదన చెందారు. అయినా, సీఎం రేవంత్‌రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 209 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటోవాలాల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, కుటుంబ పోషణ గడవక 48 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నా.. రాష్ట్ర సర్కారుకు ఏ మాత్రం కనికరం లేదని విమర్శించారు. కేసీఆర్ పాలనలో ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా సాగునీరు అందించారని, ధాన్యం సకాలంలో కొన్నారని కొనియడారు. కానీ, ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించి పది రోజులైనా కొనే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్‌కు సెగ తాకేలా పోస్టు కార్డు ఉద్యమాన్ని గ్రామ గ్రామానా చేపట్టాలని పిలుపునిచ్చారు. స్థానికుడినైన తనకు ఎంపీగా పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ ప్రజలు అవకాశం ఇచ్చి కేసీఆర్ విధానాలను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భాను ప్రసాద్‌రావు, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, పెద్దపల్లి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ విప్ బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, దుర్గం చిన్నయ్య, నడిపెల్లి దివాకర్‌రావు, నాయకులు రఘువీర్‌సింగ్, దాసరి ఉష, గంట రాములు, మిర్యాల రాజిరెడ్డి, మేకల మల్లేశం తదితరులు ఉన్నారు.

అట్టహాసంగా కొప్పుల నామినేషన్

పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం 10 గంటలకు పెద్దపల్లికి చేరుకున్న ఆయన, తొలుత బస్టాండ్ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం మహిళలు ఆయనకు కుంకుమ తిలకం దిద్దగా, ముస్లింలు దట్టీ కట్టారు. అక్కడి నుంచి నామినేషన్‌కు కలెక్టరేట్‌కు బయలుదేరి వచ్చారు. 11 గంటలకు కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజామ్మిల్‌ఖాన్‌కు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. కలెక్టరేట్ ఎదుట మీడియాతో మాట్లాడారు. తర్వాత నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా చేరుకుని, అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్ షో నిర్వహించారు. నామినేషన్ సందర్భంగా పార్లమెంట్ పరిధిలోని బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 'జై కేసీఆర్' 'జైకొప్పుల' నినాదాలతో హోరెత్తించారు.

రోడ్ షోలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

నేను ఇక్కడే పుట్టిన. *ఇక్కడే పెరిగిన. నా చివరి శ్వాస వరకూ మీతోనే ఉంట. ఒక కార్మికుడి బిడ్డను నేను. అన్నా.. అంటే నేనున్నాననే మీ సోదరుడిని. మీతో అంతటి అనుబంధం ఉన్నది. మీ బిడ్డను ఎంపీగా ఆదరించండి. మీకోసం పార్లమెంటులో ప్రశ్నించే గొంతుకనవుతా. ఈ ఎన్నికల్లో ఆగర్భ శ్రీమంతుడికి.. భూగర్భ కార్మికుడికి మధ్యే పోటీ జరుగుతున్నది. నాకు ఒక్కసారి అవకాశం ఇవ్వండి. అభివృద్ధి చేసి చూపిస్తా.*

- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలె

ఎమ్మెల్యే ఎన్నికల వేళ కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చింది. వంద రోజుల్లోనే నెరవేరుస్తా మని రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు పలికిండు. ఇప్పుడు నిధుల్లేవని సాకు చూపుతూ వాయిదా వేస్తున్నడు. ఢిల్లీకి డబ్బు సంచులు తరలిస్తూ తెలంగాణను లూటీ చేస్తున్నడు. ఓట్లపై ఉన్న శ్రద్ధ ప్రజల కష్టాలపై లేదు. ప్రభుత్వం 420 హామీలను నెరవేర్చేదాకా.. బీఆర్ఎస్ వెంట పడుతుంది. అందుకే ప్రజలు ఈ పార్లమెంటు ఎన్నికల్లో ప్రజల గొంతుకైన బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలె. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలె.

- బాల్క సుమన్, మాజీ ప్రభుత్వ విప్

ఇక్కడ పదవులు..బయట కంపెనీలు

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో మూడు తరాలుగా కాకా కుటుంబం పదవులు అనుభవిస్తున్నది. రిజర్వేషన్లను వాడుకుంటూ అధికారాన్ని అనుభవిస్తున్నది. ఎన్నికలు రాగానే కంపెనీలు పెడతామని నిరుద్యోగులకు ఆశ చూపుతది. తీరా గెలిచిన వెంటనే నియోజవర్గంలో కాకుండా బయట కంపెనీలు పెడుతూ నిండా ముంచుతున్నది. ఆ కుటుంబాన్ని ఒడించి కొప్పులను గెలిపిస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతది.

-దుర్గం చిన్నయ్య, మాజీ ఎమ్మెల్యే, బెల్లంపల్లి

మంచిర్యాలలో నిర్మానుష్యంగా ఐబీ ప్రాంతం

నిర్మానుష్యంగా మంచిర్యాల మార్కెట్ ఏరియా

భానుడి భగభగలు

- మంచిర్యాల జిల్లాలో దంచికొట్టిన ఎండ
- 45 డిగ్రీలకు చేరిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో సతమతమైన ప్రజలు
- ముందు జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 19 : మంచిర్యాల జిల్లాలో శుక్రవారం ఎండ దంచికొట్టింది. గరిష్ఠంగా 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం ఏడింటికే భానుడు భగభగ మండగా, సాయంత్రం ఏడింటి దాకా ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేసింది. అత్యవసర పరిస్థితులుంటే తప్ప ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రాలేదు. మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. గురువారం ఆసిఫాబాద్ జిల్లాలో ఒకరు, మంచిర్యాల జిల్లాలో ఒకరు వడదెబ్బతో ప్రాణాలొదిలారు. ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయించడంతో పాటు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు, ఏసీలను విపరీతంగా వాడుతున్నారు. రోహిణి కార్తెకు నెల రోజుల ముందే సూర్యుడు తన ప్రతాపం చూపిస్తుండగా, ముమ్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

వారం రోజులుగా జిల్లాలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు

	గరిష్ఠం	కనిష్ఠం
శనివారం	40.0	26.2
ఆదివారం	35.4	22.4
సోమవారం	42.6	24.7
మంగళవారం	42.9	24.4
బుధవారం	44	25.4
గురువారం	44.2	24.8
శుక్రవారం	45.2	27 డిగ్రీలు....

ముందు జాగ్రత్తలే మేలు

వేసవిలో వడదెబ్బ నుంచి రక్షించుకోవడానికి ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తలనొప్పి, కండరాలు పట్టేయడం, వికారం, కళ్లుతిగడం, వాంతులు చేసుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ప్రతిరోజూ 5 నుంచి 6 లీటర్ల నీటిని తాగాలని, శీతల పానీయాలకు బదులు మజ్జిగ, నిమ్మ, పండ్ల రసాలు తాగడం ఉత్తమమని, పండ్లు కూడా తీసుకోవాలని సూచిస్తున్నారు. బైక్ మీద వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, చిన్న పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు ఎండలో ప్రయాణం చేయకూడదని, తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సివస్తే గొడుగు పట్టుకొని వెళ్లాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలితే ఓఆర్ఎస్ పొడిని కలిపి తాగించాలని, అది దొరకని పరిస్థితుల్లో నీటిలో కొంచం ఉప్పు లేదా పంచదారా కలుపుకొని తాగాలని, అపస్మారక స్థితిలోకి వెళ్తే నీరు తాగించకుండా వీలైనంత త్వరగా దవాఖానకు తరలించాలని డాక్టర్లు చెబుతున్నారు.

ఎండకు గొడుగు రక్షణతో వెళ్తున్న మహిళలు

అభ్యర్థుల ఖర్చులపై నిఘా పెట్టాలి

- నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకోవాలి
- ప్రత్యేక వ్యయ పరిశీలకుడు జే వివేకానంద రాజేంద్ర
- కలెక్టర్లు, అధికారులతో వీడియోకాన్ఫరెన్స్

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 19 : పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులను ప్రతి రోజూ పరిశీలించి, వివరాలు నమోదు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రత్యేక వ్యయ పరిశీలకుడు జ్యాదవార్ వివేకానంద రాజేంద్ర సూచించారు. శుక్రవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల విభాగం అధికారులతో ఎన్నికల ఖర్చుల వివరాల నమోదు, పర్యవేక్షణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి జూన్ 4 వరకు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచార కార్యక్రమంలో భాగంగా చేసే ప్రతి ఖర్చునూ తప్పనిసరిగా లెక్కించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణ, ఫిర్యాదులు, అక్రమంగా డబ్బు, మద్యం రవాణా నిరోధం, శాంతి భద్రతల పర్యవేక్షణ తదితర అంశాలపై సూచనలు చేశారు. ఎన్నికల ఖర్చు వివరాలను ప్రతిరోజూ పరిశీలించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు మించి ఖర్చులు ఉంటే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఫ్లయింగ్, స్టాటిస్టికల్, వీడియో సర్వేయలెన్స్, వీడియో పరిశీలన, అకౌంటింగ్ బృందాలను నియమించినట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్, సీ- విజిల్ యాప్‌ల ద్వారా ఇప్పటివరకు వచ్చిన 14 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు అందజేయాలని రాజకీయ పార్టీల నాయకులకు తెలియజేశామని తెలిపారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు చేస్తున్నామని, పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించినట్లు చెప్పారు. ఎస్పీ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ డబ్బు, మద్య, కానుకల అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్ పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.1.70 కోట్లను సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు, సదయ్య, కరుణాకర్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు